**Andhra Jyothi**

# 3 దశల్లో వర్సిటీ పోస్టుల భర్తీ

- **ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి రంగం సిద్ధం**
- **త్వరలో జీవో...ఆ తరువాత ప్రకటన?**

విశాఖపట్నం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను మూడు దశల్లో భర్తీ చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. తొలి దశలో ఆచార్యులు, మలిదశలో అసోసియేట్ ప్రొఫెసర్లు, చివరగా అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం చేపట్టాలని నిర్ణయించినట్టు సమాచారం. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు స్క్రీనింగ్ నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు కొంత సమయం పట్టే అవకాశం ఉన్నందున ముందుగా ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ చేపట్టాలని వీసీలు సూచించారు. బుధవారం విజయవాడలోని గేట్‌వే హోటల్‌లో జరిగిన ఉపకులపతుల సమావేశంలో అధ్యాపకుల నియామకంపై చర్చ జరిగింది. అన్ని వర్సిటీలలో తొలివిడత 1104 పోస్టుల భర్తీకి ప్రభుత్వం జూలైలో జీవో ఇచ్చింది. దీనిప్రకారం ఆచార్య పోస్టులు 90, అసోసియేట్ ఆచార్య పోస్టులు 168, అసిస్టెంట్ ఆచార్యుని పోస్టులు 846 భర్తీచేయాలి. అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల విషయంలో ప్రతిష్టంభన కొనసాగుతున్న నేపథ్యంలో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ చేపట్టాలని ఉపకులపతులు సూచిస్తుండడంతో ప్రత్యేకంగా జీవోలు ఇవ్వాల్సి ఉంది. త్వరలో జీవోలు విడుదల కావచ్చునని అంచనా వేస్తున్నారు. మూడు కేటగిరీలకు కలిపి గతంలో ఉన్న జీవో మేరకు ప్రకటన విడుదల చేస్తే న్యాయపరంగా ఇబ్బందులు వస్తాయని వీసీలు భావించారు. ఆచార్య, అసోసియేట్ ఆచార్యుల నియామకానికి వేర్వేరుగా జీవోలు ఇస్తే మంచిదని సూచించారు. ఆ మేరకు ఉన్నత విద్యాశాఖ కసరత్తు చేస్తోంది.